# టీజింగ్

"జళ్ళో సంపెగ పూవు... వళ్ళోసందేల నువ్వు..." పక్కనున్న ఫ్రెండ్స్‌ని చూసి, మరింత ఉత్సాహంతో, ముందునడుస్తున్న 'బేబీ' కేసి చూస్తూ, గొంతుకాస్త పెంచాడు రఘురావ్.

ప్రక్కనున్న ఫ్రెండ్స్ ఈలవేస్తూ గోల చేస్తున్నారు.

ఆ అమ్మాయి వెనక్కి తిరగలేదు. తల వంచుకొని ముందుకు సాగిపోతోంది.

ఆ ప్రాంతంలో ఓ కాలేజి వుంది. కాలేజి కుర్రాళ్ళు, కాలేజి అయిపోయాక, తిన్నగా ఇంటికి వెళ్ళకుండా, ఆ ప్రాంతమంతా తిరుగుతూ, కన్పించిన అమ్మాయిని ఏడిపిస్తూ, సాయంత్రం ఆరు వరకు గడుపుతుంటారు. అలా 'టీజ్' చేసే వాళ్ళలో రఘురావ్ బృందం ఒకటి.

అలా 'టీజ్' చేయకపోతే ఆ 'ఏజ్' లో 'మజా' 'తాజా' గా వుండదని, పులకితమవుతూ, కేరింతలు కొట్టే వయస్సని సంపూర్ణంగా నమ్మే వాళ్ళల్లో రఘురావ్ ఒకడు. తండ్రి పోలీసాఫీసర్ అవ్వడం వల్ల, మరీ రెచ్చిపోయి గోల చేస్తాడు.

"ఎవరీ వన్నె చిన్నెల వెన్నెల రాణి..." అన్నాడు రఘురావ్.

అంతకుముందు ఆమెనెప్పుడు ఆ ప్రాంతంలో చూడలేదు.

"గురువా! తెలీడం లేదు... ఆ కన్నులు చూస్తుంటే 'మీనాక్షి' అని, జలపాతంలా జారిన ఆ జడని చూస్తుంటే 'అరాళకుంతల' అని, ముక్కు చూస్తే క్లియోపాత్ర అని, పెదవులు మధుపాత్రలని..." చెప్పుకుపోతున్నాడు రఘురావ్ మిత్రుడు ఆనంద్ ఆనందంగా—

"అసందర్భ ప్రలాపి... ఏది ముందు ఏది వెనుక వర్ణించాలో తెలీదు... అందమైన బోల్డు శరీరముండగా, ముక్కు కళ్ళు కన్పించాయా?..." అన్నాడు కోపంగా రాఘవ.

"అనకూడదు కానీ గురూ... బొత్తిగా 'సినిమా లాంగ్వేజ్' లోకి వెళ్ళేనని అనకుండా వుంటే చెప్తా..." అని ఆగి— నిముషం తరువాత—

"ఆ నడక 'రేఖ' లా, ఆ నడుం సన్నగా 'జీనత్ అమన్' నడుంలా, ఆ కళ్ళు 'మందాకిని' కళ్ళల్లా... ఓహ్... ఏమని వర్ణింతును... సాక్షాత్తు ముక్కోటి సినీ తారామణులు ఇక్కడే ప్రత్యక్షమయినట్టుంది..."

"ఛీ! ఛీ!... ఎప్పుడూ సినిమా గోలే... ఈ సాయం వేళ... చిరుగాలి అలలకి కదిలే పైట..."

"కట్! కట్! కట్!... ఇది కథ..." (వాళ్ళ మాటలకి రచయితకి కోపం వచ్చింది.)

"అబ్బా... నేవోపలేము..." వాళ్ళ ధోరణి వాళ్ళదే.




"విరహాన వేగిపోయి విలపించే కథలు ఎన్నో..."

"ఎంతసేపు మనం గోల చేయడమే కానీ... చిలకల కొలికి పలుకు పలుకదేమీ?..." అనుమానంగా అన్నాడు రఘురావ్.

"అలకేమో..."

"అందానికి అందం అలక..."

"నాలో ఏదో వుప్పొంగి పోతోంది..."

"కట్... కట్..."

ఆ అమ్మాయి కుడిపక్క వీథిలోకి తిరిగింది.

వీళ్ళు ఆ అమ్మాయి వెనుకే—!

ఏవో అంటూనే వున్నారు.

ఆ అమ్మాయి ఓ యింటి దగ్గిర ఆగి, వీళ్ళకేసి చూసి, ఓ నవ్వు నవ్వింది.

"యురేకా! నవ్వింది మల్లె చెండు..."

"ధన్!" మని వాళ్ళ మొహంమ్మీదే గేటు వేసేసి లోపలికి వెళ్ళిపోయింది.

విన్నటి కథ యిది.

నేడు—

ఆ అమ్మాయి నవ్వింది.

గుండెలు గువ్వల్లా కలల్తో ఎగిరిపోయాయి అందరివి.

మాటల్లోకి దించారు ఎలాగైతేనేం—

"...హోటల్‌కి వస్తారా?... ఎనీ ఆబ్‌జెక్షన్..." అడిగాడు ఆనంద్.

"నో ఆబ్‌జెక్షన్..." నవ్వింది.

మెల్లగా హోటల్‌కి చేరారు. సర్వర్‌కి 'కాఫీ' ఆర్డర్ యిచ్చారు.

"జస్ట్ వన్ మినిట్..." అంటూ కదిలింది 'కౌంటర్' వైపు... నిముషం తరువాతవచ్చికూర్చుంది.

కాఫీ కార్యక్రమం అయ్యాక.

"మళ్ళీ రేపు ఇదే వేళకి యిక్కడే..." అన్నాడు ఉత్సాహంగా రఘురావ్.

"లేదు... నేనే మిమ్మల్ని కలుస్తా... మీకు ఇప్పుడు తెలీని చోటు, నాకు తెలుసున్న చోటు..."

"ఎక్కడ? ఎప్పుడు?" ఆత్రంగా అడిగారు.

"జస్ట్ సస్పెన్స్" నవ్వింది.

పావుగంట గడిచింది మాటల్లో—

పావుగంట తరువాత... అందరూ షాక్ తిన్నారు.

* * * *

మర్నాడు—

ఆమె వాళ్ళని కలిసింది.

నవ్వింది. నవ్వలేదు వాళ్ళు(!)

"ఎక్కడ? ఎప్పుడు?" కలిసింది అన్న పాఠకుడి ప్రశ్నకి జవాబు—

"జైల్లో..." ఆమె ఆడ పోలీసు... ఆమె హోటల్లో ఒక నిముషం కౌంటర్ కేసి వెళ్ళడం, పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేయడం రఘురావ్ బృందం గమనించలేదు.

## బహుమతి పొందిన కార్టూన్ స్ట్రిప్

